


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 86 | బుధవారం 26 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..


2

- ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావు
- విజయవాడలో ఆయనతో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

# నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు..

## ఒప్పందాలతో అధికారులు తిరిగొస్తారు

"నేను అమెరికా వెళ్లాలనుకున్న సమయంలోనే 'వైబ్రెంట్ గుజరాత్' పేరిట ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కూడా పెట్టుబడుల కోసం అమెరికా, కెనడా పర్యటనకు వెళ్లారు. అమెరికా పెట్టుబడులు గుజరాత్‌కు రాకుండా, తెలంగాణకు వెళ్తాయన్న ఉద్దేశంతో నా పర్యటనకు అనుమతి నిరాకరించారు. గుజరాత్ అభివృద్ధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశం తప్ప రాజకీయ కారణాలేవీ లేవు. ఇది పూర్తిగా రాజకీయ వివక్ష. తెలంగాణ అభివృద్ధిని అడ్డు కోవడమే. కేంద్రం వైఖరి ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం" అని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తన పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణకు వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించ డానికే కేంద్రం కుట్ర చేసిందంటూ ధ్వజమెత్తారు.


- మిగతా2లో

## ఇరాన్ పై అమెరికా కఠిన ఆంక్షలు.. ప్రతీకారానికి సిద్ధమన్న టెహ్రాన్

- ఇరాన్ పై అమెరికా కొత్తగా కఠిన ఆంక్షల విధింపు
- ప్రతీకార దాడులకు దిగుతామని హెచ్చరించిన ఇరాన్
- సైనిక చర్య, చమురు ఎగుమతుల నిలిపివేతకు సంకేతాలు
- అమెరికా ప్రయోజనాలను దెబ్బతీస్తామన్న ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్
- చైనా, రష్యా తమ వెంటే ఉన్నాయని ఇరాన్ ధీమా


2

## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ.. కులగణన పై కీలక సూచన

- కులగణన విధానంపై ఖర్గే, రాహుల్ అభ్యంతరం
- ఓపెన్ ఎండెడ్ విధానంతో కులాల వివరాలు తప్పుగా నమోదయ్యే ప్రమాదం
- కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని డిమాండ్

2



## ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు


2

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్‌గా 48 గంటల దీక్షకు పిలుపు
- రక్తపోటు పడిపోవడంతో రెండో రోజే దీక్షను ముగించాలని సూచించిన సీనియర్ నేతలు
- రూ.15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమన్న బీజేపీ

## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి: హరీశ్ రావు

- 22ఏ బాధితుల సమావేశానికి హాజరైన హరీశ్ రావు
- లక్షలాది మందికి కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపాటు
- పొంగులేటి అత్యాశ ఆయన దుఃఖానికి కారణమవుతుందని వ్యాఖ్య


2

## రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన



2

- రూ.10,000 కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- ప్రాజెక్టు ద్వారా 4,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## ఇరాన్ పై అమెరికా కఠిన ఆంక్షలు.. ప్రతీకారానికి సిద్ధమన్న టెహ్రాన్

తమ దేశంపై అమెరికా కొత్తగా విధించిన కఠిన ఆర్థిక ఆంక్షలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ప్రతీకార చర్యలకు దిగుతామని, అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని హెచ్చరించింది. అమెరికా చర్యలను ఎదుర్కొనేందుకు తాము 'పూర్తిగా సిద్ధంగా' ఉన్నామని ఇరాన్ ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షల ప్రకటనపై ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. "అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణే కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలి" అని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరించలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు సహకరిస్తే పర్షియన్ గల్ఫ్ లేదా హోర్ముజ్ జలసంధి నుంచి చుక్క నూనె కూడా బయటకు వెళ్లనివ్వబోమని తేల్చిచెప్పారు. ఇరాన్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటే అమెరికా ప్రయోజనాలు, ఇంధన సరఫరా కేంద్రాలపై భారీ దెబ్బ తీస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతినిధి కూడా హెచ్చరించారు. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి.

## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ.. కులగణన పై కీలక సూచన

కులగణనలో వివరాల సేకరణ విధానంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ రాశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానాన్ని మార్చి.. కులాల పేర్లతో కూడిన డ్రాప్‌డౌన్ జాబితాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుత విధానంలో వ్యక్తులు తమ కులం పేరును ఎలా చెబితే అలా నమోదు చేస్తారని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఒకే కులానికి చెందినవారి వివరాలు వేర్వేరు పేర్లతో నమోదైతే.. ఆ కులం వేలాది ఎంట్రీలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా జరిగితే కులాల జనాభాపై కచ్చితమైన సమాచారం లభించదని తెలిపారు. ఫలితంగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల స్థితిగతులపై సరైన అంచనా సాధ్యం కాదన్నారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కూడా తేలకపోవచ్చని కాంగ్రెస్ నేతలు అన్నారు. కులగణనలో 'బ్యాక్‌వర్డ్ క్లాస్' అనే పదం చేర్చలేదని లేఖలో ప్రస్తావించారు. కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీల గణనలో ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించవచ్చన్నారు. తెలంగాణ, బీహార్ కుల సర్వేల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి.. రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ కోరారు.

## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి: హరీశ్ రావు

కుత్బుల్లాపూర్‌లో నిర్వహిం చిన 22ఏ బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. "భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించు కోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు.. ఒప్పందాలతో అధికారులు తిరిగొస్తారు

తెలంగాణకు వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించ డానికే కేంద్రం కుట్ర చేసిందంటూ ధ్వజమెత్తారు. లండన్ పర్యటనను ముగించుకుని సోమవారం హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికసిత్ భారత్‌లో భాగంగా తెలంగాణ రైజింగ్- 2047 లక్ష్యంతో విదేశీ పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లాలన్న తన పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. తమ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా ఖండిస్తున్నారని, పార్లమెంటులో తమ పార్టీ ఎంపీలు ఈ అంశాన్ని లేవనెత్తుతారని తెలిపారు. "తెలంగాణను కేంద్ర ప్రభుత్వం చులకనగా చూస్తోంది. చిన్నచూపుతో వివక్షను ప్రదర్శిస్తోంది. నా అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడమంటే.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించినట్టే. పైగా, అనుమతి నిరాకరణకు రాజకీయ కారణాలను ఆపాదించడం సమంజసం కాదు. లండన్, అమెరికా పర్యటనలకు సంబంధించి విదేశాంగ శాఖకు దరఖాస్తు చేసిన సమయంలోనే అన్ని వివరాలను, సమావేశాల వివరాలను వెల్లడించాను. అయినా, లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. అమెరికాకు అనుమతి నిరాకరించడం ఏమిటి!?" అని ప్రశ్నించారు. మోదీ ఇంకా గుజరాత్‌కు సీఎం మాదిరిగా, సలహాదారు మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం వైఖరితో తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు రావేమోనన్నదే తమ ఆక్రోశమని అన్నారు. కేంద్రంతో సత్సంబంధాలతో సాగాలని తాము ప్రయత్నిస్తున్నా.. కేంద్రం సహకరించడం లేదని తప్పుబట్టారు. మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం సన్నగిల్లి, నిరంకుశత్వం పెరిగిందన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం అడ్డుకుంటోందని, ముందుగానే అన్ని వివరాలు నివేదించినా.. లండన్‌కు అనుమతినిచ్చి.. అమెరికా పర్యటనకు నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. పైగా, తాను అమెరికాలోని హార్వార్డ్ యూనివర్సిటీలో చదువుకున్నానని, ఒప్పందాల విషయంలో తనకు అవగా హన ఉందని, ఆహ్వానం కూడా ఉందని వివరించారు.

**వెంటే.. విదేశీ రాయబారులు ఉంటారు**

తన అమెరికా పర్యటన విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం కేంద్ర, రాష్ట్ర సత్సంబంధాలను దెబ్బతీస్తుందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. అయితే, అమెరికా పర్యటనలో మీరు పాకిస్థాన్ మద్దతుదారుడు, న్యూయార్క్ మేయర్ మామ్దానీని కలిసేందుకు ప్రయత్నించారని, అందుకే అనుమతిని నిరాకరించినట్లు బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారని విలేకరులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. విదేశీ పర్యటనల పేరుతో మోదీ పాకిస్థాన్ వెళ్లవచ్చని, అక్కడ బిర్యానీ తిని రావచ్చని, కానీ, రాష్ట్రాల సీఎంలు అమెరికా మాత్రం వెళ్లకూడదా అని నిలదీశారు. "నా విదేశీ పర్యటన విషయంలో ఎలాంటి గోప్యత లేదు. దరఖాస్తు చేసినప్పుడే అన్ని వివరాలూ స్పష్టంగా పేర్కొన్నాం. విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలోని ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని పేర్కొన్నాం. యూకే, యూఎస్ పర్యటనలకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ జరుపుకోవాలని నిర్ణయించిన నేపథ్యంలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాలని భావించాం. విదేశీ కంపెనీలకు మన సమ్మిట్ గురించి వివరిస్తే.. ఇక్కడ పెట్టుబడులు పెట్టాలా లేదా అనే అంశంపై ఆయా కంపెనీలు 4 నెలల ముందే బోర్డు మీటింగ్స్‌లో చర్చించుకుని, ఆమోదించుకునే అవకాశం ఉంటుంది. ఆ కారణంగానే విదేశీ పర్యటనకు కార్యాచరణ రూపొందించాం. ఇది చాటుమాటు వ్యవహారం కాదు. నా పర్యటన మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగ శాఖకు ఇచ్చాం. ఒక సీఎం విదేశాలకు వెళితే, విదేశీ రాయబారులు వెంటే ఉంటారు. ప్రతి కార్యక్రమాన్నీ వారు పర్యవేక్షిస్తారు. ప్రతి క్షణం షెడ్యూలు ప్రకారమే ఉంటుంది. ప్రతి సమావేశంలో భారత రాయబారి కూడా ఉంటారు. ఆ వివరాలన్నింటినీ కేంద్రానికి నివేదిక రూపంలో సమర్పిస్తారు. గతంలో రాయబారిగా పని చేసిన జైశంకర్ ప్రస్తుతం విదేశాంగ మంత్రిగా ఉన్నారు. ఈ విషయాలన్నీ ఆయనకు తెలుసు. అయినా, మామ్దానీ న్యూయార్క్ మేయర్. ఆయనను, ఇతరులను ఎవరినైనా కలవాలంటే అపాయింట్‌మెంట్ ఉండాలి" అని తెలిపారు. అనుమతి నిరాకరణపై బీజేపీ నేతలు విచక్షణ కోల్పోయి ప్రభుత్వంపై, సీఎం అధికారిక పర్యటనపై తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, వారి ప్రచారాలపై స్పందించబోనని, వారిది ఆ స్థాయి కాదంటూ ఎద్దేవా చేశారు. గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లిన సమయంలో ఎలాగైతే వివరాలు ఇచ్చామో అదే విధంగా ఇప్పుడూ విదేశాంగ శాఖకు సమర్పించామని తెలిపారు. అనుమతి నిరాకరణకు రాజకీయ నిర్ణయాలే కారణమని కేంద్రం చెబుతోందని, అవి ఏమిటో ప్రధాని మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రికి తెలియకుండా ఒక రాష్ట్ర సీఎం విదేశీ పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరిస్తుందా అని ప్రశ్నించారు.

# ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..

ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ కాసేపు ముచ్చటించారు. పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు లోకాయుక్త వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకంతో రాష్ట్రంలో పరిపాలన మరింత జవాబుదారీగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన

ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగం కొత్త ఊపు అందుకుంది. పవన విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రఖ్యాత సుజ్లాన్ సంస్థ రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్లు మండలం, హులికెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యుత్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో ఉన్న సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించి, అక్కడి విండ్ టర్బైన్‌పై తన సంతకం చేశారు. ఈ సందర్భంగా సుజ్లాన్ ప్రతినిధులు ప్రాజెక్టు విశేషాలను మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో అతిపెద్ద విండ్ భాగస్వామిగా ఉన్న సుజ్లాన్, తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా మరో 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం), అమిలినేని సురేంద్రబాబు (కల్యాణదుర్గం), దగ్గుపాటి వెంకట ప్రసాద్ (అనంతపురం అర్బన్) పాల్గొన్నారు. సుజ్లాన్ గ్రూప్ తరఫున కో-ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వి.బి. రావు, ఇతర భాగస్వామ్య సంస్థలైన టాటా పవర్ ఎండీ సంజయ్ బంగా, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎమ్. కమలాకర బాబు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రెండో రోజే విరమించారు. దీక్షలో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, పార్టీ సీనియర్ నేతల సూచన మేరకు మంగళవారం దీక్షను ముగించారు. సోమవారం ప్రారంభమైన ఈ దీక్షలో రాంచందర్ రావు ఆరోగ్యం మంగళవారం క్షీణించింది. ఆయన రక్తపోటు (బీపీ) గణనీయంగా పడిపోవడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. దీంతో, సీనియర్ నేతలు దీక్షను విరమించాలని ఆయనకు సూచించారు. అనంతరం, పార్టీ సీనియర్ నేత, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్.. రాంచందర్ రావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అంతకుముందు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలు దీక్షా శిబిరానికి వచ్చి రాంచందర్ రావుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని హితవు పలికారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

దీక్ష విరమించడానికి ముందు రాంచందర్ రావు 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "తెలంగాణ విద్యార్థుల గొంతుక.. 58 ఏళ్ల యువ నేతగా చెప్పుకునే వ్యక్తికి కానీ, హైదరాబాద్‌లోని ఆయన గులాంకు కానీ వినిపించడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడంతో 40 లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరమవుతున్నారు" అని ఆయన ఆరోపించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "యువతకు తామే సంరక్షకులమని చెప్పుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఓ బూటకం. తెలంగాణ యువత మేల్కొంది, ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉంది" అని రాంచందర్ రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రేపు ఇదే యువత ప్రభుత్వాన్ని గద్దె దించుతుందని ఆయన అన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## దిమాగీ నక్సల్స్‌లోకి వారు వస్తే విషమం!



సమాంతర పరిణామాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. మన జీవితాల్లో జరుగుతున్నవి ఇంకెక్కడో అచ్చంగా అలాగే సాగుతుంటే వాటిని తెలుసుకోవాలన్న కుతూహలం పెరుగుతుంది. కానీ సారూప్యతలు కొన్ని సందర్భాల్లో భయానకంగానూ ఉంటాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని వాడి పెద్ద చర్చకు దారితీశారు. నక్సలైట్ల భావజాలంతో ప్రేరేపితులైన కొందరు ఆలోచనాపరులు దేశంలో అనేక రంగాల్లో పాతుకుపోయారనీ, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్థాయికి వారు ఎదిగారనీ విమర్శించారు. భౌతికంగా నక్సలైట్లను తుదముట్టించామనీ ఇప్పుడు దిమాగీ నక్సల్స్‌ను ఏకాకులను చేయాలనీ పిలుపునిచ్చారు. భారత్‌లో దిమాగీ నక్సల్స్ కిందకు ఎవరు వస్తారన్నది ప్రధాని స్పష్టంచేయలేదు. రాజకీయ ఉపన్యాసాల్లో వ్యక్తులనూ, బృందాలనూ ఫలానా వాళ్లుగా ముద్రవేయటమే ప్రధానంగా ఉంటుంది. అందుకే వాళ్ల గురించి కచ్చితమైన నిర్వచనాలు అప్పటికప్పుడు ఉండవు. తమను ఉద్దేశించే మోదీ దిమాగీ నక్సల్స్ అనే పదాన్ని వాడారని భావించిన కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగారు. కొందరైతే తాము దిమాగీ నక్సల్స్‌మేనంటూ ప్రకటనలు కూడా చేశారు. ప్రతిపక్షాలను దిమాగీ నక్సలైట్లుగా ముద్రవేయటం ప్రధాని మోదీ అభిమతం కాదనీ భారత రాజ్యాంగాన్ని అంగీకరించకుండా హింస ద్వారా ప్రభుత్వాన్ని కూల్చుదామనుకునే వాళ్లను ఉద్దేశించి మాత్రమే దాన్ని ఆయన అన్నారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వివరణ ఇచ్చారు. నిజంగానే హింసతో ప్రభుత్వాన్ని కూల్చాలనుకునే వారికి మద్దతు ఇచ్చే మేధావులకే దిమాగీ నక్సల్స్ ముద్రను పరిమితం చేస్తే అదొక తీరుగా ఉంటుంది. కానీ మేధోరంగంలో అలాంటి వ్యక్తులు ఇప్పుడు చాలా తక్కువగా ఉన్నారు. వాళ్లు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్థాయిలో లేరు. ప్రజలను ఉగ్రూతలూగించే స్థాయిలో వాళ్ల ఆలోచనలు ఇప్పుడు లేవు. దిమాగీ నక్సల్స్ జాబితాలోకి ప్రభుత్వ విధానాలూ, సిద్ధాంతాలపై అసమ్మతి తెలిపే వారందరూ వస్తే పరిస్థితులు వేరే విధంగా మారతాయి. భిన్న భావవ్యక్తీకరణకే అప్పుడు ప్రమాదం ముంచుకొస్తుంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతోన్న పరిణామాలను చూస్తే ఆ ప్రమాదాన్ని తేలికగా తోసిపుచ్చలేం. మనకు ఎంతో దగ్గరైన ప్రజాస్వామ్య దేశాల్లో అమెరికాతో పాటు, ఇటలీ, ఇజ్రాయెల్‌లు కూడా అగ్రభాగాన ఉన్నాయి. అక్కడి ప్రభుత్వాధినేతలూ, పాలక పార్టీల నాయకులూ రాజ్యాంగానికి లోబడి వ్యవహరించే మేధావులపై, విద్యావేత్తలపై, సాహిత్యకారులపై గురిపెట్టి మరీ ఎదురుదాడులు చేస్తున్నారు. ఆ మూడు దేశాల్లో ఉదారవాద ప్రజాస్వామ్యం, బహుళ సంస్కృతి వాదం, సామాజిక--ఆర్థిక న్యాయంపై పట్టుదలతో వ్యవహరించే మేధావులను జాతి వ్యతిరేకులుగా చిత్రీకరించటం ఎక్కువైంది. వాళ్లందరినీ వామపక్షవాదులుగా, దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేసేవారుగా ముద్రవేసి విమర్శలు గుప్పించటం సాధారణమైపోతోంది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ధోరణి బాగా పెరిగింది. వ్యక్తి స్వేచ్ఛకూ భావవ్యక్తీకరణకూ తిరుగులేదనుకునే దేశంలో సాక్షాత్తూ అధ్యక్షుడే ఎదురుదాడి ఆరంభించటం ఇతర దేశాల్లోని నాయకులకూ ప్రేరణగానే ఉంటుంది. భారత్‌లో కూడా వివిధ రూపాల్లో హిందూత్వ రాజకీయాలను వ్యతిరేకించే మేధావులపై విమర్శలూ, ఆరోపణలూ ఇటీవలకాలంలో బాగా ప్రబలం అవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని పరిస్థితిని మదింపువేస్తే అమెరికా, ఇటలీ, ఇజ్రాయెల్‌లో జరిగే పరిణామాలకూ ఇక్కడి వాటికీ సారూప్యత స్పష్టంగానే కనపడుతుంది. అమెరికా సమాజం మరింత మానవత్వంగా ఉండాలనీ, సంపదలో అసమానత్వాన్ని తగ్గించాలనీ, పర్యావరణాన్ని పరిరక్షించాలనీ, రక్షణ ఖర్చులకు కోతపెట్టాలనీ కోరుకునే మేధావులను ట్రంప్ ఎన్నో సందర్భాల్లో రాడికల్ లెఫ్ట్, అల్ట్రాలెఫ్ట్ అనీ, మార్క్సిస్టులూ, ఫాసిస్టులూ అని ముద్రలు వేసి విమర్శించారు. "మన దేశంలో చీడపురుగుల్లా ఉన్న కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, ఫాసిస్టులు, రాడికల్ లెఫ్ట్ దుండగులను మనం నిర్మూలిస్తాం" అంటూ ఎన్నోచోట్ల విరుచుకుపడ్డారు. మేధావులకూ, ప్రగతిశీల విద్యార్థులకూ నిలయాలైన విశ్వవిద్యాలయాలపై ఒక దశలో బహుముఖ యుద్ధమే మొదలుపెట్టారు. వెనుకబడిన జాతులకూ, వివిధ సంస్కృతుల వారికీ, మహిళలకూ తగు ప్రాధాన్యం ఇవ్వాలనే విధానాలకు వర్సిటీలు స్వస్తిచెప్పాలని డిమాండు చేశారు. ఆ విధానాలన్నీ ప్రతిభను దెబ్బతీస్తాయన్నదే ఆయన వాదన. ట్రంప్ ఉద్దేశంలో రిజర్వేషన్ల లాంటివి ఏవీ ఉండకూడదు. తన మాటవినటం లేదని హార్వర్డ్ యూనివర్సిటీకి నిధులనే ఆపేశారు. మూర్ఖులనూ అవివేకులనూ ఆ వర్సిటీ తయారుచేస్తోందని దుయ్యబట్టారు.

## పీఎం సూర్య ఘర్ యోజనతో విద్యుత్ పొదుపు -- ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలి





-రాచుమర్రిలో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను పరిశీలన

-రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

-నాణ్యత ప్రమాణాల్లో రాజీ వద్దు.. కనీసం 20 ఏళ్ల పాటు మన్నికగా ఉండాలి

-లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

కర్నూలు, ఆగస్టు 25 వార్త సాక్ష్యం

పీఎం సూర్య ఘర్ యోజనతో విద్యుత్ పొదుపు -- ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం మండలం రాచుమర్రి గ్రామంలో లబ్ధిదారుడు అజయ్ కుమార్ పీఎం సూర్య ఘర్ యోజన ద్వారా ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటు, దాని పనితీరు, సామర్థ్యం, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలను అధికారులు, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్లు, ఇతర పరికరాలు అత్యున్నత ప్రమాణాలతో ఉండేలా చూడాలని, ఏర్పాటు చేసిన ప్లాంట్లు కనీసం 20 సంవత్సరాల పాటు సమర్థవంతంగా పనిచేసేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పీఎం సూర్య ఘర్ యోజన ప్రధాన ఉద్దేశ్యం ప్రతి కుటుంబానికి సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించడం, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అని మంత్రి పేర్కొన్నారు. పథకం ద్వారా లబ్ధిదారులకు వాస్తవ ప్రయోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశిం చారు. రాచుమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ 2 కిలోవాట్ల సామర్థ్యంతో ఉందని అధికారులు వివరించారు. ఈ పథకం కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు 60 శాతం వరకు సబ్సిడీ అందుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో ఏపీఎస్పీడీసీఎల్ ద్వారా అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం,



సహాయక సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. పీఎం సూర్య ఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని, తద్వారా విద్యుత్ పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సహకరించాలని మంత్రులు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆదోని ఆర్డీవో అరుణ దేవి, విద్యుత్ శాఖ ఎస్.ఈ ప్రదీప్ కుమార్, జిల్లా టి.డి.పి అధ్యక్షులు గుడిసి కృష్ణమ్మ, జోన్ -5 ఇంచార్జి శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాజయోగిని ప్రకాశమణి దాది 19 వ పుణ్యస్మృతి సందర్భంగా రక్తదాన శిబిరం





-విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ కేంద్రాలలో మెగా రక్తదాన శిబిరాలు

కర్నూలు ప్రతినిధి,ఆగస్టు 25, వార్త సాక్షం

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల పరిధిలోని పార్నపల్లి గ్రామంలోని ఆనంద సరోవర్ అనుభూతి కేంద్రంలో మంగళవారం విశ్వ బంధుత్వ (రాజయోగిని ప్రకాశమణి దాది 19 వ పుణ్యస్మృతి) దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సేవా విభాగం సౌజన్యంతో బి.కె.సిస్టర్ విజయ అధ్యక్షతన, రాజయోగిని ప్రకాశమణి దాది 18వ పుణ్యస్మృతి సందర్భంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 30 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సిస్టర్ విజయ మాట్లాడుతూ రాజయోగిని ప్రకాశమణి దాది 19 వ పుణ్యస్మృతి సందర్భంగా అన్ని కేంద్రాలలో మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందని అందులో భాగంగానే ఇక్కడ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని అన్నారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ చంద్రరావు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందిం చేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. విశ్వ బంధుత్వ భావనతో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినంద నీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో



బ్రహ్మకు మారీస్ సేవా విభాగం ప్రతినిధులు, బి.కే.రాజేష్ బి.కే డాక్టర్.ప్రదీప్,రెడ్ క్రాస్ కౌన్సిలర్ శివన్న, టెక్నీషియన్స్ కిరణ్ కుమార్,అయ్య స్వామి, గోవిందమ్మ మరియు సిబ్బంది,స్వచ్ఛంద రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోలీసుల భద్రతా సూచనలు

చందోలు ఆగస్టు 25, వార్త సాక్షం

విద్యార్థులు ర్యాగింగ్, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు మహిళల భద్రత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని చందోలు పోలీసులు సూచించారు. రెడ్డిపాలెంలోని విజేత పాఠశాలలో విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందోలు ఎస్ఐ మాధవరావుతో పాటు బాపట్ల ఈగల్ బృందం పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు అవగా హన కల్పించింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాధవరావు మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, నేరానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై వేధింపులు లేదా ఇతర నేరాలు జరిగినప్పుడు భయపడకుండా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండి, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. ఈగల్ బృందం సభ్యులు 'నో డ్రగ్స్--నో టెన్షన్' నినాదంతో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం లేదా సరఫరాకు సంబంధి



ంచిన సమాచారం తెలిసిన వెంటనే 1972కు సమాచారం అందించాలని సూచించారు .విద్యార్థులు చదువుతో పాటు చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన పెంచుకోవాలని, సైబర్ నేరాలు, ర్యాగింగ్, డ్రగ్స్ వంటి సామాజిక సమస్యల పై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# పేద రోగులకు సీఎం చంద్రబాబు కొండంత భరోసా

**-32 మందికి రూ. 30,46,059 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

నంద్యాల ఆగస్టు 25 వార్త సాక్ష్యం

పేద రోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండంత భరోసా ఇస్తున్నారని, తాను ఎంపీ గా సిఫారసు చేసిన వెంటనే బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు మంజూరు చేసి వారికి తమ ప్రభుత్వం అండగా ఉందన్న మనోధైర్యం సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం నంద్యాల బొమ్మలసత్రం లోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో 32 మంది బాధితులకు రూ. 30,46,059 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ భాధితులు ఈశ్వర రెడ్డి, బేతంచెర్ల రూ. 3,01,977 లు, బొర్రబేని వెంకటేశ్వర్లు యాదవ్, ఎన్. కొత్తపల్లి రూ. 30,786 లు, పి కిరణ్ కుమార్, నీలివిధి రూ.26,884 లు, బోయ యెల్ల నాయుడు, శివపురం రూ.36,500 లు, వడ్డే పార్వతి రైతునగరం రూ. 35,028 లు, ఎం.నరేంద్రనాథ్ రెడ్డికి మరణం గోవిందపల్లి, రూ.53,500 లు, రొడ్డ సురేష్ కుమార్, ముజ్జాఫర్నగర్ రూ. 2,26,641 లు, షేక్ షఫీవున్, కొత్తపల్లి రూ. 60,781లు, కర్ణాటి విశ్వనాథ్ రెడ్డి, శ్రీశైలం రూ. 1,53,930 లు మాదినేని పర్వత నాయుడు ఎర్రగుడి, బనగానపల్లి రూ.1,30,267 లు, బొబ్బిటి ప్రభాకర్ రెడ్డి, నంద్యాల రూ. 1,76,539 లు, పెద్ద ముంతల నాగరత్నమ్మ శ్రీ నగర్ కాలనీ నంద్యాల, రూ. 70,000 లు, మహమ్మద్ , షరీఫున్ బీ, సిరివెళ్ల రూ.1,00,310 లు, గుర్రం సుధా రాణి, మంచాలకట్ట రూ. 26,218 లు, దుదేకుల రేషమ్మ, కరిమద్దల రూ. 20,675 లు, వెంకట లక్ష్మమ్మ, రుద్రవరం రూ. 68,415 లు, వర్రా ఈశ్వరమ్మ, మూలసాగరం నంద్యాల రూ. 25,000 లు, ముక్కు సుబ్బలక్ష్మి, నంద్యాల రూ. 70,000 లు, మల్లిశెట్టి నాగ పూజిత, రాఘవేంద్ర నగర్, కర్నూలు రూ. 27,000 లు, పాణ్యం తులసమ్మ, నల్లగట్ల రూ. 92,445 లు, మల్లేల శివశంకర రెడ్డి గువ్వలకుంట్ల రూ. 1,00,567 లు, కొడితేం రామచద్రయ్య బనగానపల్లి రూ. 66,713 లుమల్లిరెడ్డి శ్రీనాధరెడ్డి, పెద్ద దేవలాపురం, శ్రీశైలం రూ, 35,000 లు, చిక్కొండ అయ్యన్న, బుజనూరు, పాణ్యం రూ. 30,000లు, వేణుగోపాల్ రెడ్డి, మూలసాగరం, నంద్యాల2,46,454 లు, మేరమ్మ, వడ్డెమాన్, రూ.20,464 లు, మొల్లా రహిమాన్ బేగ్, వెలుగోడు, శ్రీశైలం రూ. 51,310లు, సుంకన్న, పెద్దపాడు, పాణ్యం రూ.52,655 లు, ఎన్. సావిత్రమ్మ, రుద్రవరం రూ. 45,000 లు, మాల జ్యోతి, సంజామల, రూ.65,000 లు, మైలా మాధవ కృష్ణయ్య, అయ్యలూరు, రూ.64,781లు, ఎం. శివ రామసుబ్బారెడ్డి, బనగానపల్లె రూ. 6,00,000 లక్షలు, ఇలా మొత్తం 32 మంది కి రూ 30,46,059 లక్షల సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పంపిణీ చేశారు. మా ఆసుపత్రి ఖర్చులకు సహకరించమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కోరగా వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సిఫారసు చేసి మాకు అండగా ఉండేందుకు అవసరమైన సీఎం సహాయ నిధి నిధులు మంజూరు చేసి ఆదుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి, సీఎం చంద్రబాబుకు భాధితులు ధన్యవాదములు తెలిపారు.



నంద్యాల ఎంపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు బాధితులకు అందజేస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

# ప్రత్యేక టెట్ లో ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి:ఏపీటీఎఫ్






ఆత్మకూరు ఆగస్టు 25 వార్త సాక్ష్యం

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ నందు ఉపాధ్యాయులకు ఎటువంటి మినహాయింపు లేదు కావున నోటిఫికేషన్ ను సవరించి ఇవ్వాలి అని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్.ఉమ్మర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, మంగళవారం పట్టణం లో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ లో ఉపాధ్యాయు అందరికీ అర్హత మార్కులు 40 శాతంగా, పరీక్ష ఆన్లైన్ లో కాకుండా ఆఫ్లైన్లో నిర్వహించుట, బోధన సబ్జెక్టుల ప్రమాణికంగా పరీక్ష ని నిర్వహించాలని తెలిపారు, నిన్న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక నోటిఫికేషన్లు ఎటువంటి మినహాయింపులు లేవు కావున ఉపాధ్యా యుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జీవో ప్రతులను దహనం చేయడం జరిగింది. ప్రభుత్వము ఉపాధ్యాయుల పట్ల సానుకూల దృక్పథంతో ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలి, లేకుంటే జిల్లా రాష్ట్ర స్థాయిలో ధర్నాలు చేస్తాం, రేపు నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ప్రత్యేక టెట్ పై వ్యతిరేకంగా జరుగు నిరసన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యా యులు పిలుపు ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్ర మంలో ఏ పి టి ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు . శ్రీనివాసులు, ఆరిఫ్ బాషా, . ఇక్బాల్ బాషా, ఆర్ టి ఎఫ్ కన్వీనర్లు . అబ్దుల్ వహీ ద్ ,పి. దాస్, శంకర్, జిల్లా కౌన్సిలర్లు . సుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, శివశంకర్,. చిన్న కృష్ణయ్య, శివశంకర్, ఆత్మకూరు, కొత్తపల్లి మండల అధ్యక్షులు . అంబయ్య, రవికుమార్ వెంకటరమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో నేత్రదాన, వైద్య శిబిరం పై కళాశాల విద్యార్థినిలకు అవగాహన









ఆత్మకూరు, ఆగస్టు 25 వార్త సాక్ష్యం

జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పట్టణం లోని ఆదిత్య జూనియర్ కళాశాలలో మంగళవారం నేత్రదాన అవగాహన వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్యులు షేక్షావలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నేత్రదానం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నేత్రదానం ద్వారా మరణానంతరం ఇద్దరు అంధులకు చూపు కల్పించే అవకాశం ఉందని వైద్యులు వివరించారు. మరణించిన వ్యక్తి నుంచి వీలైనంత త్వరగా, సాధారణంగా ఆరు గంటల్లోపు కార్నియాను సేకరించడం ద్వారా చూపులేని వారికి వెలుగును అందించవచ్చని తెలిపారు.నేత్రదానం చేయడం వల్ల దాత కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆర్థిక భారం ఉండదని, నేత్రాలను సేకరించే ప్రక్రియ తక్కువ సమయంలోనే పూర్తవుతుందని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా అనేక సందర్భాల్లో నేత్రదానం చేయవచ్చని, ప్రజలు అపోహలను వీడి నేత్రదానానికి ముందుకు రావాలని వైద్యులు సూచించారు.కంటి చూపు కోల్పోయిన వారికి వెలుగును అందించడం ద్వారా మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని, తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా నేత్రదాన ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయ భాస్కర్ నాయుడు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## కూడో క్రీడలతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు



బాపట్లఆగస్టు 25 వార్త సాక్ష్యం

పట్టణంలోని అంబేద్కర్ భవన్లో జిల్లా స్థాయి రెండో కూడో ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. క్రమశిక్షణతో క్రీడలను అభ్యసించి జిల్లా, రాష్ట్ర, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న కూడో క్రీడలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సహించాలని కోరారు.జాతీయస్థాయి కూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ కూడో సంఘం ఉపాధ్యక్షుడు అదే కిరణ్ కిషోర్, బాపట్ల జిల్లా కూడో సంఘం ప్రధాన కార్యదర్శి దివ్య తేజ్ బాపట్ల ప్రాంతానికి చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కూడో సంఘం అధ్యక్షుడు రామకోటి రెడ్డి, సంయుక్త కార్యదర్శి సామ్యూల్ రాజ్, బాపట్ల సంఘం అధ్యక్షుడు పుట్టా ఆదిశేషా రెడ్డి, సంయుక్త కార్యదర్శి పీటా సారథి, మాజీ సైనికులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి 104 వైద్య సేవలు

గురజాల ఆగస్టు 25 వార్త సాక్ష్యం



గురజాల మండలంలోని ప్రతి గ్రామానికి 104 వైద్య సేవలను మరింత సమర్థవంతంగా, మెరుగైన రీతిలో అందుబాటులోకి తీసుకురావాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ చుక్కా రత్నమోహన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా పేద, సామాన్య ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 104 సేవలను ప్రతి గ్రామానికి సమర్థవంతంగా అందిం చాలని విజ్ఞప్తి చేశారు.లక్ష్మీనారాయణ వినతిపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ చుక్కా రత్నమోహన్ స్పందిస్తూ, త్వరలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి ఈ అంశంపై చర్చిస్తామని తెలిపారు. గురజాల మండల ప్రజలు ఎదుర్కొంటున్న వైద్యపరమైన ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు.మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని జిల్లా వైద్యాధికారి పేర్కొన్నారు.

## రైతు సేవలే లక్ష్యంగా పనిచేయాలి



సత్తెనపల్లి ఆగస్టు 25 వార్త సాక్ష్యం

సత్తెనపల్లి రూరల్ మండలం ఫణిదం పీఏసీఎస్ చైర్మన్‌గా కొర్నె శ్రీనివాసరావు, సభ్యులుగా దేవరపల్లి సునీత, యర్రగుంట్ల వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సొసైటీ ప్రతినిధులు రైతుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సొసైటీలోని బకాయిలను త్వరితగతిన వసూలు చేసి, సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ స్థాయిలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 26 ఆగష్టు 2026

# పర్యాటక ప్రాంతాల స్వచ్ఛతపై దృష్టి



బాపట్ల ఆగస్టు 25 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్.వి ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టులు పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించేలా స్వచ్ఛత హరిత ఆకుల గుర్తింపు విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో పర్యాటక ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, హరిత ఆకుల గుర్తింపు విధానం అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పర్యాటకుల సౌకర్యాలు, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమిస్తూ హోటళ్లు, రిసార్టులు నిర్వహించాలని స్పష్టం చేశారు.తాగునీటి నాణ్యత, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, వంటశాలల పరిశుభ్రత, ఆహార నాణ్యత వంటి అంశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. మాంసాహార పదార్థాలను తాజాగా ఉంచడంతో పాటు ఆహార తయారీ ప్రాంతాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టాలని స్పష్టం చేశారు.పర్యాటకుల భద్రత విషయంలోనూ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రిసార్టుల్లో ప్రాణరక్షణ కవచాలు, నిఘా కెమెరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్యాటకులకు మెరుగైన సేవలు అందిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే సంస్థలకు వాటి పనితీరు ఆధారంగా ఐదు, మూడు, రెండు, ఒక హరిత ఆకుల గుర్తింపులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

**-'బే ఆఫ్ బాపట్ల' వెబ్ సైట్ లో వివరాలు**

జిల్లాలోని హోటళ్లు, రిసార్టుల వివరాలను 'బే ఆఫ్ బాపట్ల' వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు కలెక్టర్ తెలిపారు. హరిత ఆకుల గుర్తింపు స్థాయి ఆయా సంస్థలు పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ ప్రమాణాలను ఏ మేరకు పాటిస్తున్నాయో తెలియజేసేలా ఉంటుందన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. మండల, గ్రామస్థాయి కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యాటక ప్రాంతాలను పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం అందరి బాధ్యతగా భావించాలని సూచించారు.సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షణ ఇంజినీర్ అనంతరాజు, పర్యాటక శాఖ అధికారి బెనహర్, గుంటూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతిబసు, ప్రకాశం జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి బాలమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, హోటళ్లు, రిసార్టుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి అత్యవసర విభాగం పనులు వేగవంతం చేయాలి

**-మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేయాలి**

**-కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి**

చీరాల, ఆగస్టు 25 వార్త సాక్ష్యం



చీరాల ఏరియా ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న అత్యవసర విభాగం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం చీరాల ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్ రోజువారీ ఓపీ, రోగుల వివరాలు, వివిధ విభాగాల్లో అందుతున్న వైద్య సేవలు, వసతులపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర, ఎముకలు, చిన్నపిల్లలు, ప్రసూతి విభాగాలను పరిశీలించి అక్కడి సౌకర్యాలను సమీక్షించారు. ఆసుపత్రి ఆవరణలో అంతర్గత రహదారులు, పార్కింగ్, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కమ్యూనిటీ సదుపాయాలు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ ద్వారా ఒంగోలు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీకి పంపాలని ఏపీఎంఎస్ఐడీసీ ఏఈని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించేందుకు అవసరమైన అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆసుపత్రి ఆవరణలో పార్కు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు రోగుల అటెండర్లకు బెంచీలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పరిసరాల్లో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. భవనాల మరమ్మతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు రూపొందించిన అంచనాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహాన్ని మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసి ఐలాండ్ అభివృద్ధి చేసే ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య, డీసీహెచ్ఎస్ పద్మావతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుభాషిని, ఆర్డీవో నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ డేనియల్ జోసఫ్, తహసీల్దార్ గోపికృష్ణ, ఏపీఎంఎస్ఐడీసీ ఏఈ పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చెంచు గిరిజన గర్భిణీ మహిళలకు ఉచిత వైద్య శిబిరం

ఆత్మకూరు ఆగస్టు 25 వార్త సాక్ష్యం

సామాజిక ఆరోగ్య కేంద్రంలో చెంచుగిరిజన గర్భిణీ మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఓ. లలిత, (డి సి హెచ్ హెచ్ ఓ ) అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లోని గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. గర్భిణీలు ఎటువంటి ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరము గర్భిణీలకురక్త పరీక్షల తో పాటు స్కానింగ్ మరియు అవసరమైన ఐరన్ సిరప్ ప్రోటీన్ పౌడర్లు ఉచితంగా అందజేశారు. ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో గిరిజన గూడేలకు చెందిన పలువురు గర్భిణీ మహిళలకు, వైద్య శిబిరానికి హాజరై ఉచిత వైద్య సేవలను అందించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకున్నారు . ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్,రాయుడు, డా.జగదీషకుమార్, డా.మస్తాన్ వలి, డా.ఆస్మా, వైద్య సిబ్బంది, ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.




# ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి -- పి ఆర్ టి యు







**-స్పెషల్ టెట్ పేరుతో ప్రత్యేక ప్రయోజనం లేదు**

**-అర్హత మార్కులు తగ్గించాలి లేదా పూర్తి మినహాయింపు ఇవ్వాలి**

నంద్యాల ఆగస్టు 25 వార్త సాక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో గత అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సేవలందిస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ అర్హత నిబంధనల నుంచి మినహాయించాలని, లేదా వారికి ప్రత్యేకంగా తక్కువ అర్హత మార్కులను నిర్ణయించాలని పి ఆర్ టి యు నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎన్.వి. భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై. రాంపక్కి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ, స్పెషల్ టెట్ పేరుతో నిర్వహిస్తున్న పరీక్షలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రయోజనం లేకుండా సాధారణ టెట్ నిబంధనలే వర్తింపజేయడం సముచితం కాదని అన్నారు. ఇప్పటికే నియామక ప్రక్రియ ద్వారా అర్హత సాధించి, సంబంధిత విద్యార్హతలు, ఉపాధ్యాయ శిక్షణ అర్హతలు పొంది, అనేక సంవత్సరాలుగా నిరంతర బోధనా సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను కొత్తగా నియామకానికి పోటీ పడే అభ్యర్థులతో సమానంగా టెట్ అర్హత ప్రమాణాలతో పరీక్షించడం పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం టెట్ లో జనరల్ కేటగిరీకి 60%, బిసి లకు 50%, ఎస్సీ / ఎస్టి / కేటగిరీలకు 40% అర్హత మార్కులు ఉన్నాయి. అయితే ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల విషయంలో వారి బోధనా అనుభవం, సీనియారిటీ, సర్వీస్ రికార్డు, విద్యార్థుల విద్యా ఫలితాలు, దీర్ఘకాలిక సేవ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక సడలింపు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ద్వారా టెట్ కు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసి, అనంతరం పలు సందర్భాల్లో సవరణలు చేసిన నేపథ్యంలో, ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల సమస్యను మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సేవా పరిస్థితులను సమన్వయం చేస్తూ పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ టెట్ మార్గదర్శ కాలలో నోటిఫికేషన్‌కు ముందు సంబంధిత నియామక నిబంధనల ప్రకారం ప్రభుత్వ/స్థానిక సంస్థల్లో నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించిన అంశాన్ని కూడా ప్రభుత్వం స్పష్టంగా అమలు చేయాలని కోరారు. ప్రధాన డిమాండ్లు ఇప్పటికే ప్రభుత్వ/స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ క్వాలిఫైయింగ్ క్రిటీరియా రూపొందించాలి. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులందరికీ, కేటగిరీతో సంబంధం లేకుండా 40% అర్హత మార్కులను పరిగణనలోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలి. ప్రత్యామ్నాయంగా, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తి మినహాయింపు కల్పించాలి2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు ఉన్న టెట్ మినహాయింపును స్పష్టంగా అమలు చేసి, అర్హులైన ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సేవ, వయస్సు, సర్వీస్ రికార్డు, బోధనా అనుభవం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక సడలింపు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరపాలి. టెట్ కు హాజరయ్యే ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు అవసరమైతే ప్రత్యేక సిలబస్ , క్వశ్చన్ పేపర్ పెట్టన్ మరియు క్వాలిఫైయింగ్ క్రిటీరియా ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు తమ సేవా కాలంలో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థకు విశేష సేవలందిస్తున్నారని వారు పేర్కొన్నారు. వారి అనుభవం, విద్యార్హతలు, బోధనా సామర్థ్యం, దీర్ఘకాలిక సేవలను పరిగణన లోకి తీసుకుని మానవతా దృక్పథంతో ప్రత్యేక టెట్ సడలింపు కల్పించడం న్యాయస మ్మతమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తి మినహాయింపు లేదా ప్రత్యేక క్వాలిఫైయింగ్ మర్క్స్ కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఎన్ సి టి సి, కేంద్ర విద్యాశాఖతో సంప్రదింపులు జరిపి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పి ఆర్ టి యు,నంద్యాల జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు

# కర్నూలు జిల్లాలో ఈనెల 30 న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

**-నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ను కట్టుదిట్టంగా నిర్వహించాలి**

**-అభ్యర్థులు ఉదయం 8:30 లోగా పరీక్ష హాల్ లో ఉండాలి ఆ తరువాత అనుమతించరు**

**-ఫోన్లు,ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించవు**

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

కర్నూలు , ఆగస్టు 25 వార్త సాక్ష్యం

కర్నూలు జిల్లాలో ఈనెల 30వ తేదీ జరిగే నీట్ పీజీ ప్రవేశ పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను , కళాశాలల యాజమాన్యాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మంగళవారం ఆదేశించారు. ఈనెల30న జరిగే నీట్ పిజి ప్రవేశ పరీక్ష ల నిర్వహణ పై కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు, పరీక్ష నిర్వహించు కళాశాలల యాజమాన్యాలకు పలు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా లో కర్నూలులో 5 కేంద్రాలలో , ఆదోని, ఎమ్మిగనూరు, లలో ఒకటి చొప్పున పరీక్ష కేంద్రాలు ఉన్నవని తెలిపారు.అభ్యర్థుల ను ఈనెల 30వ తేదీ ఉదయం 7 గంటల నుండి పరీక్ష హాల్లోకి అనుమతిస్తారని కావున అభ్యర్థులు ఉదయం 8-30 నిమిషాలు లోగా పరీక్ష హాల్లో ఉండాలని , ఆ తరువాత వచ్చే వారిని అనుమతించరని తెలియజేశారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమై 12:30 గంటలకు ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థులు ఫోన్లు , ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకొని రాకూడదని తెలియజేశారు. కాలేజీ యాజమాన్యాలు అభ్యర్థులకు కేటాయించిన గదుల వివరాలు , హాల్ టికెట్ నంబర్లు విడివిడిగా పెద్ద పెద్ద అక్షరాలతో తెలిపే సమాచారం , గదులకు చేరుకునే సైన్ బోర్డులు పెట్టి తెలియజేయాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష వ్రాసే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.గాలి , వెలుతురు , త్రాగే మంచినీరు , ఇంటర్నెట్ మొదలగు సౌకర్యాలు అన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులతో , సిబ్బందితో జిల్లా లోని అన్ని పరీక్ష కేంద్రాలలో మెడికల్ క్యాంపు మరియు అంబులెన్స్ ఏర్పాటు చేయాలని , డాక్టర్లకు సంబంధించిన ఫోన్ నెంబర్లు మెడికల్ క్యాంపులో ఉండాలని డెప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ ను ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాలలో నిరంతర కరెంటు సరఫరా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారిని ఆదేశించారు. రెండు రోజుల ముందుగానే కళాశాలలో సెక్యూరిటీ ఏర్పాటు చేసుకొనే చర్యలు తీసుకోవాలని , అభ్యర్థులను తనిఖీ చేసి హాల్లోకి పంపే చర్యలు పోలీసు వారు తీసుకోవాల్సిందిగా




ఆదేశించారు. కళాశాలల పరిసరాలలో ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు , జిరాక్స్ సెంటర్లు మూయించి , 144 సెక్షన్ విధించి ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ మరియు తహసిల్దార్లను ఆదేశించారు. అభ్యర్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని అవసరమైతే ఆర్టీసీ బస్సుల సౌకర్యం కాలేజీల వరకు వచ్చేలాగా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ను కోరాలని ఆదేశించారు ఈ సమావేశానికి డిఆర్ఓ,వెంకటనారాయణమ్మ డెప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ డాక్టర్ భాస్కర్ , తహసీల్దారులు వెంకట రమేష్ , ఆంజనేయులు , రవికుమార్ , ఎలక్ట్రికల్ డిఈ విజయ భాస్కర్ , ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి , కళాశాలల నిర్వహకులు రామేశ్వర్ రెడ్డి , రాఘవేంద్ర , నాగేందర్ రెడ్డి , డిప్యూటీ తహసిల్దార్లు మొదల గువారు పాల్గొన్నారు. ఎమ్మిగనూరు తహసిల్దార్ ఫోన్ ద్వారా హాజరయ్యారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళల రక్షణకు శక్తి యాప్ పై అవగాహన





-కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళలకు అవగాహన
-మహిళలు, పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలి
-పాములపాడు ఏఎస్ఐ షేక్. నూర్ మహమ్మద్

**ఆత్మకూరు ఆగస్టు 25 వార్త సాక్ష్యం**

ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ " శక్తి యాప్ టీం " ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ,సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు,ఆత్మకూరు డి.ఎస్.పి ఆర్.రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు మరియు ఆత్మకూరు రూరల్ సీఐ ఎం . సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణ లో ఆత్మకూరు కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో లో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ కుమారి, నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం లోనీ అంగన్వాడీ టీచర్లకు " శక్తి యాప్ పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్ఐ షేక్.నూర్ మహమ్మద్ మాట్లాడుతూ బాలికల, మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్ ఉపయోగాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు ఏదైనా ప్రమాదం ఉంటే వెంటనే వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఏపీకె ఫైల్స్ లాంటివి ఏదన్నా సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను ఎలా వాడాలి, దానీ ఉపయోగాల గురించి తెలుపడమే కాకుండా శక్తీ యాప్ ను వారి సెల్ ఫోన్ లలో డౌన్లోడ్ చేయించి ఎవరైనా మీకు ఇబ్బంది పెట్టినట్లయితే అధైర్య పడకుండా మీకు రక్షణ గా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన " శక్తీ యాప్ " ను ఉపయోగించి 112 కు గానీ 1098 కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారి సహాయం పొందవచ్చు అని అవేర్నెస్ చేసినాము.



అదేవిధంగా 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మైనర్ విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ ను నడపడానికి ఇవ్వద్దని తెలియజేశారు మీ ఇంట్లోని మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా " హెల్మెట్ " పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి మరియు ఎవ్వరూ కూడా మీ ఇంట్లోని వారు మీ భర్త, కొడుకు, అన్నా, తమ్ముడు, మేనమామ లు ఎవ్వరైనా సరే మధ్యం త్రాగి వాహనాలను నడపవద్దని చెప్పమని సూచిస్తూ...త్రాగి వాహనం నడిపితే పోలీసులకు చిక్కి కేసు పెడితే కోర్టు వారు 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను విధిస్తారు అని అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు

# వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా

**వేమూరు ఆగస్టు 25 వార్త సాక్ష్యం**



అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిధి భరోసాగా నిలుస్తోందని వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు నియోజ కవర్గానికి చెందిన ఐదుగురు బాధితులకు మొత్తం రూ.7,77,260 విలువైన వైద్య సహాయం మంజూరైంది.చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన ముళ్లపూడి గౌతమ్‌కు రూ.2,51,305, కొల్లూరు మండలం తాడిగిరిపాడు గ్రామానికి చెందిన కనపర్తి మోహన్‌రావుకు రూ.1,01,030, వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన కొల్లిపర వెంకటేశ్వరరావుకు రూ.1,22,941, అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన లిగినేని మోహన్‌రావుకు రూ.2,51,460, చుండూరు గ్రామానికి చెందిన కోట సూర్యవతికి రూ.50,524 చొప్పున వైద్య సహాయం మంజూరైంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వైద్య ఖర్చులకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సిఫారసు లేఖ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. మంజూరైన సహాయానికి సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తోం దన్నారు .ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వైద్య సహాయం అవసరమైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని నక్కా ఆనందబాబు తెలిపారు. తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

-18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలి
-ఓటర్ల జాబితా శుద్ధీకరణ ద్వారా ఓటర్ల టర్నౌట్‌ను పెంచి, ఆరోగ్యకరమైన ఎన్నికల నిర్వహణ
-ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ లావణ్య వేణి

**కర్నూలు, ఆగస్టు 25 వార్త సాక్ష్యం**

అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ అవ్వనున్న నేపథ్యంలో క్లెయిమ్స్--అభ్యంతరాల పరిష్కారం, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ లావణ్య వేణి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, 2026 (సర్ -2026) అంశం పై ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) అనేది ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు చేపడుతున్న ప్రత్యేక ప్రక్రియ అని అబ్జర్వర్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు కొనసాగడం, అర్హత ఉన్నప్పటికీ కొందరి పేర్లు జాబితాలో లేకపోవడం వంటి సమస్యలను సరిదిద్దేందుకు సర్ ప్రక్రియను చేపడుతున్నట్లు అబ్జర్వర్ తెలిపారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణ ద్వారా ఓటర్ల టర్నౌట్‌ను పెంచి, ఆరోగ్యకరమైన ఎన్నికల నిర్వహణకు బాటలు వేయవచ్చు అన్నారు. అందుకే ఓటర్ల జాబితా శుద్ధీకరణ (పురిఫికేషన్ అఫ్ ఎలక్టరల్ రోల్ )కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణ ప్రక్రియ దాదాపు జిల్లాలో పూర్తయ్యే దశకు చేరుకుందన్నారు. ప్రస్తుతం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ మరియు పరిష్కార ప్రక్రియ కొనసాగుతోందని, వీటన్నింటినీ నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలన్నారు. సర్ ప్రక్రియలో 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రాథమిక డేటాగా తీసుకుని ప్రస్తుత ఓటర్లతో మ్యాపింగ్ చేస్తున్నట్లు అబ్జర్వర్ తెలిపారు. కుటుంబ సభ్యులు, పూర్వీకులతో ఓటర్లకు సంబంధించిన లింక్‌ను కొనసాగించడం ద్వారా ఒకే వ్యక్తికి వివిధ నియోజకవర్గాలు లేదా జిల్లాల్లో ఓటు ఉండే అవకాశం తగ్గుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రతి బూత్ స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ విజ్ఞప్తి చేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాజకీయ పార్టీల తరఫున నియామకం జరగలేదని గుర్తించినట్లు తెలిపారు. ప్రతి దశలో ఓటర్ల జాబితా పరిశీలన, ధృవీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలంటే రాజకీయ పార్టీల భాగస్వామ్యం అవసరమన్నారు. లు జాబితా, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా తదితర వివరాలను పరిశీలించి, అనుమానాస్పదంగా ఉన్న పేర్లు, కుటుంబ వివరాల్లో వ్యత్యాసాలు, ఓటర్ల వలసలు, డూప్లికేట్ ఓట్లు వంటి అంశాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అబ్జర్వర్ సూచించారు. లు స్థానికంగా పనిచేస్తున్నందున వారికి కూడా రాజకీయ పార్టీలు, సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాలో ఉన్న వ్యక్తులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన సందర్భాల్లో వారిని సంప్రదించడం, వాస్తవ పరిస్థితులను నిర్ధారించడం వంటి అంశాల్లో అన్ని వర్గాల సహకారం అవసరమన్నారు. రాజకీయ పార్టీలు,లు, ప్రజల సమిష్టి సహకారంతో ఓటర్ల జాబితా మరింత శుద్ధమైనదిగా, పారదర్శకమైనదిగా రూపొందించవచ్చని, తద్వారా రాబోయే ఎన్నికలకు ఖచ్చితమైన ఓటర్ల డేటా అందుబాటులో ఉంటుందని అబ్జర్వర్ పేర్కొన్నారు. అదే సమయంలో ఓటర్ల భాగస్వామ్యం, పోలింగ్ శాతం పెంచేందుకు కూడా ఇది దోహదపడుతుందన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపు, చేర్పులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించడం ద్వారా ఓటర్ టర్నౌట్‌పై కూడా సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఇంకా ఏవైనా రేషనలైజేషన్ ప్రతిపాదనలు, భవనాల మరమ్మతులు, మార్పులు లేదా ఇతర అవసరాలు ఉంటే వాటిని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఇటువంటి మార్పులు చేపట్టడం సాధ్యం కాదని, అందువల్ల ప్రస్తుత సమయంలోనే పెండింగ్ అంశాలను పరిష్కరించుకోవాలన్నారు. కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల్లో 18 ఏళ్లు పైబడిన జనాభాతో పోలిస్తే నమోదైన ఓటర్ల సంఖ్య కొంత తక్కువగా ఉందని కాబట్టి 18 ఏళ్లు నిండినప్పటికీ ఇంకా ఓటర్లుగా నమోదు కాని వారిని గుర్తించి ఫారం-6 ద్వారా ఓటర్లుగా నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. తుది జాబితా ప్రచురణకు సంబంధించిన మిగిలిన ప్రక్రియలన్నీ పూర్తయ్యాయన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా సుమారు 22 లక్షలు ఉండగా, వచ్చే ఏడాది సెన్సస్ పూర్తయిన తర్వాత జనాభాకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయన్నారు.. జిల్లా పరిధిలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. పాణ్యం నియోజకవర్గం కొంత భాగం జిల్లా పరిధిలో, మరికొంత భాగం ఇతర ప్రాంతం నంద్యాలలో ఉన్నప్పటికీ, ఎక్కువ పోలింగ్ కేంద్రాలు జిల్లా పరిధిలోనే ఉన్నందున ఎన్నికల నిర్వహణ బాధ్యత ఇక్కడి ఎన్నికల యంత్రాంగానిదేనని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 1,500 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని, ఈపీ రేషియో 614గా ఉందని, ఫారమ్-6 దరఖాస్తులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిష్పత్తి మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల విషయానికి వస్తే గతంలో 2,203 పోలింగ్ కేంద్రాలు ఉండగా, సమీక్ష అనంతరం అదనంగా 249 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించి, వాటికి బూత్ లెవల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు ప్రస్తుతం జిల్లాలో పురుష ఓటర్లు 8,93,000 మంది, మహిళా ఓటర్లు 9,19,000 మంది ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా సగటు జెండర్ రేషియో 1,029గా ఉందన్నారు. సర్వీస్ ఎలక్టర్స్ 1596 మంది ఉన్నారన్నారు.





2026 ఓటర్ల జాబితా సవరణ అనంతరం పాత, ప్రస్తుత ఓటర్ల సంఖ్య మధ్య సుమారు 2.73 లక్షల మేర తగ్గుదల నమోదైం దన్నారు. ఈ వ్యత్యాసం జాబితా, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ వివరాలతో కూడా సరిపోలుతోందన్నారు.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ పి రేషియోను పరిశీలించగా ఆదోని నియోజకవర్గం అత్యల్ప స్థాయిలో ఉండగా, ఆ తర్వాత కర్నూలు నియోజకవర్గం ఉందన్నారు. ఫార్మ్-6 దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున రానున్న రేషియో మెరుగుపడే అవకాశం ఉందన్నారు. 20 నుంచి 69 సంవత్సరాల వయస్సు మధ్య అత్యధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నారన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లు సుమారు 10 వేల మంది ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అదే విధంగా 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు సుమారు 19 వేల మంది ఉన్నందున వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి సరిచూసి నిర్ధారించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫార్ముల డిజిటైజేషన్ ప్రక్రియ 86.89 శాతం పూర్తయిందన్నారు. సుమారు 13 శాతం ఫార్ములు అన్‌కలెక్టబుల్ కేటగిరీలోకి వెళ్లిన కారణంగా వాటిని డిజిటైజేషన్‌కు తీసుకురాలేకపోయినట్లు కలెక్టర్ తెలిపారు. జాబితాలో మరణించిన ఓటర్లు 3.13 శాతం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు 3.64 శాతం, ఇప్పటికే నమోదు అయి ఉన్న డూప్లికేట్ ఓటర్లు 2.91 శాతం, అందుబాటులో లేని ఓటర్లు 3.38 శాతం మంది ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు.. అబ్సెంట్ ఓటర్ల విషయంలో బి ఎల్ ఓ.లు కనీసం మూడుసార్లు క్షేత్రస్థాయిలో సందర్శించి, ఓటరు అందుబాటులో లేకపోతే పొరుగువారితో వివరాలను నిర్ధారించుకున్న అనంతరం మాత్రమే అబ్సెంట్‌గా నమోదు చేశారన్నారు. మరణించిన ఓటర్ల విషయంలో డెత్ సర్టిఫికేట్ లేదా పంచనామా వంటి ఆధారాలను పరిశీలించి నిర్ధారించిన అనంతరం మాత్రమే తొలగించారన్నారు.. నో మ్యాపింగ్, అనామలీస్‌కు సంబంధించి సుమారు 1.05 లక్షల కేసుల్లో నోటీసులు జారీ చేయగా, ప్రస్తుతం హియరింగ్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలో నోటీస్ హియరింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం హియరింగ్‌లో 33.69 శాతం పెండెన్సీ ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. మండలాల వారీగా పరిశీలిస్తే ఆలూరు ప్రాంతంలో పెండెన్సీ అధికంగా ఉందని, అనంతరం మంత్రాలయం, కర్నూలు ప్రాంతాల్లో కూడా పెండెన్సీ ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు షెడ్యూల్ రూపొంది ంచుకుని హియరింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే నోటీస్ హియరింగ్ మరియు పార్కేడ్ ఫర్ ఫైనల్ పబ్లికేషన్ ప్రక్రియలో కర్నూలు జిల్లా మెరుగైన స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అత్యధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నందున ఫారమ్-6, ఫారమ్-7, ఫారమ్-6ఏ, ఫారమ్-8 కూడా అధిక సంఖ్యలో వచ్చినప్పటికీ, వాటిని సమర్థవంతంగా పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫారమ్-6కు సంబంధించి సుమారు 11,000 తాజా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఫారమ్-6ఏకు సంబంధించి 91 దరఖాస్తులు, ఫారమ్-7కు సంబంధించి 229 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఫారమ్-8కు సంబంధించి ప్రస్తుతం 4,884 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే పెండెన్సీ విషయంలో జిల్లా మెరుగైన స్థితిలో ఉందన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పెండింగ్ దరఖాస్తులన్నింటినీ గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు అందుబాటులోకి తీసుకొచ్చిన 'బుక్ ఎ కాల్' సేవకు జిల్లాలో మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రస్తుతం మొత్తం 40 కాల్స్ పెండింగ్‌లో ఉండగా, అందులో 48 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్నవి 20 ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విస్తృతంగా ప్రచారం కల్పించడం వల్ల జిల్లాలో 9,284 కాల్స్ నమోదయ్యాయని, ఇతర జిల్లాలతో పోలిస్తే ఇది అత్యధిక సంఖ్య అని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ సేవను విస్తృతంగా వినియోగించుకుంటున్నారన్నారు. చీ+ఊరా ద్వారా అందిన 13 ఫిర్యాదులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ అనంతరం జిల్లాలో మొత్తం 2,452 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. సమావేశంలో పాణ్యం ఈఆర్ఓ మరియు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు ఈఆర్ఓ చల్లా ఓబులేసు , ఎమ్మిగనూరు ఈఆర్ఓ మధుసూదన రెడ్డి , మంత్రాలయం ఈ ఆర్ ఓ అనురాధ , పత్తికొండ ఈ ఆర్ ఓ చిన్న ఓబులేసు , ఆలూరు ఈ ఆర్ ఓ రామ సుబ్బయ్య , కోడుమూరు ఈ ఆర్ ఓ సందీప్ కుమార్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, ఏఈఆర్ఓ లు , బహుజన సమాజ్ వాదీ పార్టీ తరపున అరుణ్ కుమార్, బిజెపి పార్టీ తరపున పి.టి.సాయి ప్రదీప్, వెంకటేశ్వర్లు, నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున బజారన్న, తెలుగుదేశం పార్టీ తరఫున ఎల్.వి. ప్రసాద్ , వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున షరీఫ్, శ్రీకాంత్ రెడ్డి , జనసేన పార్టీ తరపున తల్లా మంజునాథ్ , కమ్యూనిస్టు పార్టీ తరఫున రాజశేఖర్ , ఎన్నికల విభాగం సూపరిడెంట్ మురళి , వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని ఈఆర్ఓ అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 26 ఆగష్టు 2026

# బిజినెస్

## విషపూరిత పండ్ల విక్రయం: అమెజాన్, స్విగ్గీ, బిగ్‌బాస్కెట్‌పై కర్ణాటక ప్రభుత్వం వేటు!



ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బిగ్‌బాస్కెట్‌లకు కర్ణాటక ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. తమ ప్లాట్‌ఫామ్‌లపై విషపూరితమైన 'ఉమ్మెత్త' పండ్లు, విత్తనాలను ఆహార పదార్థాలుగా విక్రయిస్తున్నట్లు గుర్తించడంతో, ఆ మూడు సంస్థల ఫుడ్ లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. కర్ణాటక ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగం కమిషనర్ కె.శ్రీనివాస్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మానవ వినియోగం కోసం ఉద్దేశించిన ఉమ్మెత్త పండ్ల జాబితాలు, ప్రకటనలను తమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించారు. ఉమ్మెత్త అత్యంత విషపూరితమైనదని, సరైన శుద్ధి లేకుండా దీనిని తీసుకుంటే తీవ్ర ఆరోగ్య సమస్యలు, కోమా, కొన్ని సందర్భాల్లో మరణం కూడా సంభవించే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదు ఈ దర్యాప్తునకు దారితీసింది. ఇన్‌స్టామార్ట్ ఆర్డర్‌తో పాటు ఉచితంగా వచ్చిన ఉమ్మెత్త పండును ఒక చిన్నారి తినడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని ఆరోగ్య మంత్రి యు.టి.ఖాదర్ తెలిపారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ఉమ్మెత్త పండ్లను నిల్వ ఉంచి, కొన్నిచోట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు నంబర్లతోపాటు అమ్మకానికి పెట్టడాన్ని గుర్తించారు. విచారణ సందర్భంగా అమెజాన్ ఎటువంటి సమాధానం సమర్పించలేదు. తాము తీసుకున్న చర్యలపై పత్రాలు సమర్పించేందుకు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ అదనపు సమయం కోరింది. బిగ్‌బాస్కెట్ మాత్రం ఆన్‌లైన్‌లో అమ్మకాలు నిలిపివేశామని,

## ఇండియాలోనే తొలి ఈ85 స్కూటర్.. హోండా నుంచి రెండు అదిరిపోయే కొత్త మోడళ్లు



ప్రీమియం వాహన విభాగంలో హోండా జోరు పెంచింది. భారత మార్కెట్లో ఏడీవీ160 స్కూటర్, రెబల్ 300 క్రూయిజర్ బైక్‌ను విడుదల చేసింది. ఏడీవీ160 ధరను రూ.1.70 లక్షలుగా నిర్ణయించగా.. రెబల్ 300 ప్రారంభ ధర రూ.2.22 లక్షలుగా ప్రకటించింది. అక్టోబర్ మధ్య నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. ఏడీవీ160ను అడ్వెంచర్ స్టైల్ మ్యాక్సీ స్కూటర్‌గా తీసుకొచ్చింది హోండా 156.9 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ఇందులో ఉంది. గరిష్ఠంగా ఈ85 ఇంధన మిశ్రమంతో నడిచే భారత్‌లో తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్ స్కూటర్‌గా దీన్ని హోండా పేర్కొంది. 27 లీటర్ల అండర్‌సీట్ స్టోరేజ్, టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, రోడ్‌సింక్, టర్న్-బై-టర్న్ నావిగేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. హోండా రెబల్ 300 మాత్రం క్రూయిజర్ బైక్ ప్రియులను లక్ష్యంగా తీసుకొచ్చింది. బాబర్ స్టైల్ డిజైన్, తక్కువ ఎత్తులో సీటింగ్, బ్లాక్డ్-అవుట్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 286 సీసీ లిక్విడ్ కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌తో ఇది పనిచేస్తుంది. స్టాండర్డ్ వేరియంట్ ధర రూ.2.22 లక్షలు కాగా.. ఈ-క్లచ్ వేరియంట్‌కు రూ.2.62 లక్షలుగా నిర్ణయించారు. ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్, టీఎఫ్‌టీ క్లస్టర్, హోండా రోడ్‌సింక్, నావిగేషన్, డ్యూయల్-ఛానల్ ఏబీఎస్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ రెండు మోడళ్ల బుకింగ్స్ ఇప్పటికే ప్రారంభమ య్యాయి. రూ.5,000 చెల్లించి హోండా వెబ్‌సైట్, అధీకృత రెడ్‌వింగ్, బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌లలో బుక్ చేసుకోవచ్చు. అక్టోబర్ మధ్య నుంచి వినియోగ దారులకు వాహనాల డెలివరీలు అందనున్నాయి.

## హోల్‌సేల్‌గా తగ్గిన పంచదార... రిటైల్‌లో మాత్రం భారం!



పంచదార ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. 10 లక్షల టన్నుల ముడి పంచదారను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించడం, అక్రమ నిల్వలపై ఉక్కుపాదం మోపడంతో గత కొన్ని రోజుల్లో హోల్‌సేల్ ధరలు సుమారు 15 శాతం మేర తగ్గాయి. అయితే, ఈ ప్రయోజనం ఇంకా వినియోగదారులకు చేరలేదు. రిటైల్ మార్కెట్‌లో కిలో పంచదార ధర ఇంకా రూ. 75 వద్దే కొనసాగుతోంది.గత మూడు రోజుల్లో ఫ్యాక్టరీ గేట్, హోల్‌సేల్ ధరలు క్వింటాల్‌పై దాదాపు రూ. 800 వరకు తగ్గాయి. దీంతో హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో పంచదార ధర సుమారు రూ. 62కి చేరింది. రాబోయే రోజుల్లో ఇది మరో రూ. 3 వరకు తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దిగుమతులకు అనుమతి, నిల్వలపై కఠిన చర్యలు ఉంటాయన్న ప్రభుత్వ ప్రకటనలతో మార్కెట్ వేగంగా స్పందించింది.ప్రస్తుతం దేశంలో సుమారు 36 లక్షల టన్నుల పంచదార నిల్వలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అక్టోబర్ 31 వరకు గడువుతో అనుమతించిన 10 లక్షల టన్నుల దిగుమతులతో కలిపి, అక్టోబర్ మధ్యలో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు నిల్వలకు ఎలాంటి కొరత ఉండదని అధికారులు భరోసా ఇస్తున్నారు.అయితే, రిటైల్ వ్యాపారులు గతంలో అధిక ధరకు కొనుగోలు చేసిన పాత నిల్వలను ఇంకా అమ్ముతున్నారు. ఆ స్టాక్ పూర్తయి, తక్కువ ధరకు కొన్న కొత్త పంచదార మార్కెట్‌లోకి వస్తేనే ధరల తగ్గుదల ప్రయోజనం వినియోగ దారులకు పూర్తిగా అందుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో హోల్‌సేల్ ధరలు నియంత్రణలోకి వచ్చినా, రిటైల్‌లో ఆ ప్రభావం కనిపించడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## ముగిసిన మూడో రోజు ఆట- లంక పోరాడినా భారత్‌దే ఆధిపత్యం




భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక గట్టిగా పోరాడుతున్నప్పటికీ, టీమిండియా పట్టు బిగించింది. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. వర్షం, వెలుతురులేమి కారణంగా ఆటను ముందుగానే నిలిపివేశారు. ప్రస్తుతం భారత్ ఇంకా 238 పరుగుల భారీ ఆధిక్యంలో ఉండి మ్యాచ్‌పై పూర్తి నియంత్రణతో ఉంది. మూడో రోజు ఆటలో శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినూశ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 135 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు. భారత స్పిన్నర్లపై స్వీప్ షాట్లను సమర్థంగా ఆడుతూ ఒంటరి పోరాటం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను ఒక అరుదైన ఘనత సాధించాడు. భారత్‌పై తన తొలి మూడు టెస్ట్ ఇన్నింగ్స్‌లలో వరుసగా మూడు 50ం స్కోర్లు సాధించిన రెండో శ్రీలంక బ్యాటర్‌గా (దులీప్ మెండిస్ తర్వాత) రికార్డు సృష్టించాడు. అతనికి కేశర నువంత (18) నుంచి కొంత సహకారం లభించింది. అయితే, వీరి భాగస్వామ్యాన్ని భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ విడదీశాడు. సుతార్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన నువంత, మిడ్-ఆఫ్‌లో సారాంశ్ జైన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్ అద్భుతంగా రాణించి చెరో మూడు వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజా ఒక వికెట్ తీశాడు. మూడో రోజు చివరి సెషన్‌లో రెండో కొత్త బంతి అందుబాటులోకి రావడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించాలని భారత్ భావించింది. కానీ, వెలుతురు తగ్గడంతో స్పిన్నర్లతోనే బౌలింగ్ కొనసాగించాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం ప్రారంభమవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆ తర్వాత వాతావరణం అనుకూలించకపోవడంతో 5:15 గంటలకు మూడో రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు. ఆట ముగిసే సమయానికి దినూశ 84 పరుగులతో, లహిరు కుమార 8 పరుగులతో క్రీజులో ఉన్నారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు (503/9 డిక్లేర్డ్)కు ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. కేవలం రెండు వికెట్లు మాత్రమే చేతిలో ఉన్నందున, నాలుగో రోజు శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించి, మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించాలని టీమిండియా భావిస్తోంది.

## శ్రీలంక స్టార్ బౌలర్ ను మందలించిన ఐసీసీ.. ఒక డీమెరిట్ పాయింట్




భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో శ్రీలంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య తన ప్రవర్తనతో వివాదంలో చిక్కుకున్నాడు. ఔటైన తర్వాత ఆగ్రహంతో ప్రవర్తించినందుకు అతడిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చర్యలు తీసుకుంది. అతడిని అధికారికంగా మందలిం చడంతో పాటు, ఒక డీమెరిట్ పాయింట్‌ను ఖాతాలో చేర్చింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2ను జయసూర్య ఉల్లంఘించినట్లు ఐసీసీ నిర్ధారించింది. అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ పరికరాలను, మైదానంలోని వస్తువులను దుర్వినియోగం చేయడం ఈ నిబంధన కిందకు వస్తుంది. సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నైట్‌వాచ్‌మన్‌గా బ్యాటింగ్‌కు వచ్చిన జయసూర్య, భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. అంపైర్ నిర్ణయంపై తీవ్ర నిరాశకు గురైన అతను, పెవిలియన్‌కు వెళుతూ బౌండరీ లైన్ వద్ద ఉన్న వెడ్జెస్‌ను బ్యాట్‌తో కొట్టాడు. డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాక గ్లోవ్స్‌ను కూడా కోపంగా విసిరేశాడు. భారత్ 503/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసిన తర్వాత, రెండో రోజు చివరి మూడు ఓవర్లలోనే శ్రీలంక రెండు వికెట్లు కోల్పోయి 8/2తో కష్టాల్లో పడింది. ఈ ఒత్తిడి కూడా అతని ప్రవర్తనకు కారణంగా భావిస్తున్నారు. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ప్రతిపాదించిన శిక్షను జయసూర్య అంగీకరించడంతో, అధికారిక విచారణ అవసరం రాలేదు.కాగా, ఈ మ్యాచ్‌లో ఐసీసీ చర్యలకు గురైన ఏకైక ఆటగాడు జయసూర్య మాత్రమే కాదు. భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత్ ఫెర్నాండో మధ్య జరిగిన ఘర్షణపై కూడా ఐసీసీ కఠినంగా వ్యవహరించింది. ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు, చెరో డీమెరిట్ పాయింట్‌ను కేటాయించింది. మ్యాచ్ 17వ ఓవర్‌లో ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. పెవిలియన్‌కు వెళుతున్న జైస్వాల్‌ను ఉద్దేశించి ఫెర్నాండో ఏదో అనడంతో, అతను వెనక్కి తిరిగి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఇద్దరూ ఒకరినొకరు నెట్టుకుంటూ తలలతో ఢీకొట్టుకున్నారు.

# స్పోర్ట్స్

## బౌలర్‌గానూ వైభవ్ సూర్యవంశీ అదుర్స్ ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు



వైభవ్ సూర్యవంశీ అంటే బ్యాట్‌తో విధ్వంసమే గుర్తుకొస్తుంది. కానీ, ఈసారి బంతితోనూ అదరగొట్టాడు. నాలుగు బంతుల వ్యవధిలోనే రెండు వికెట్లు తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో బంతితో మాత్రం తనలోని కొత్త టాలెంట్‌ను బయటపెట్టాడు.నార్త్ ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ ఘరామి 146, షాబాజ్ అహ్మద్ 167 పరుగులతో రాణించారు. అనంతరం నార్త్ ఈస్ట్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే కట్టడి చేసిన ఈస్ట్ జోన్ ఫాలోఆన్ విధించింది.రెండో ఇన్నింగ్స్‌లోనూ నార్త్ ఈస్ట్ జోన్ బ్యాటర్లు తడబడ్డారు. 90 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. వైభవ్ సూర్యవంశీ తన ఎడమచేతి స్పిన్‌తో ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు.జట్టు తరఫున అత్యధికంగా 25 పరుగులు చేసిన కిషన్ లింగ్‌డో, 4 పరుగులు చేసిన ఇమ్లివాటి లెమ్తూర్‌ను వైభవ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ రెండు వికెట్లు కూడా అతడికి క్యాచ్‌ల రూపంలో దక్కడం విశేషం. దీంతో వైభవ్‌కు ఒకే ఓవర్లో 'డబుల్ డిలైట్' దక్కిందని బీసీసీఐ సోషల్ మీడియాలో ప్రశంసించింది.మరోవైపు వైభవ్ జెర్సీ నంబర్‌పైనా ఆసక్తికర చర్చ సాగింది. అతడి జెర్సీ నంబర్‌లో కొంత భాగాన్ని టేప్‌తో కప్పి ఉంచారు. దీంతో కేవలం '3' మాత్రమే కనిపించింది. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున కూడా వైభవ్ '3' నంబర్ జెర్సీ ధరిస్తాడు. జెర్సీపై ముద్రణలో లోపం వల్లే మిగిలిన సంఖ్యను టేప్‌తో కప్పి ఉండొచ్చని భావిస్తున్నారు.

VARTHAA SAKSHAMU · వార్త సాక్ష్యం · తెలుగు దిన పత్రిక · Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 26 ఆగష్టు 2026

# 50 ఏళ్లలో ఇలాంటి విజయం చూడలేదు

## 'ఇరుముడి' సక్సెస్ మీట్‌లో రవితేజ



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఇరుముడి' చిత్రం ఘన విజయం సాధించిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. సాధారణంగా తాను ఏ విషయానికీ చలించనని, కానీ ఈ సినిమా చూసి కన్నీళ్లు ఆపుకోలేకపోయానని ఆయన పేర్కొన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. "సాధారణంగా నేను దేనికీ చలించను, కానీ 'ఇరుముడి' నన్ను కదిలించింది. హిందీలో రాజ్‌కుమార్ హిరాణీ సినిమాలు ఎలాంటి భావోద్వేగాలను పంచుతాయో, తెలుగులో ఈ సినిమా అలాంటి అనుభూతిని కలిగిస్తోంది. మా పాప మోక్ష కూడా సినిమా చూసి ఎమోషనల్ అయ్యింది" అని తెలిపారు. జీవీ ప్రకాశ్ అందించిన సంగీతం చిత్రానికి ఆత్మలా నిలిచిందని, ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తోందని కొనియాడారు. దాదాపు 20 ఏళ్లుగా థియేటర్లకు రాని వారు సైతం ఈ సినిమాను చూసేందుకు వస్తున్నారని తెలిసి ఆనందం కలిగిందని పేర్కొన్నారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ.. 'నిన్ను కోరి', 'మజిలీ' చిత్రాలు తనను తెలుగువారి ఇళ్లలోకి తీసుకెళ్తే, 'ఇరుముడి' మాత్రం వారి హృదయాల్లో స్థానం సంపాదించిపెట్టిందని రవితేజ అన్న మాటలను గుర్తుచేసుకున్నారు. కమర్షియల్ లెక్కల కంటే ప్రేక్షకులకు భావోద్వేగపరంగా కనెక్ట్ అవ్వాలనే లక్ష్యంతోనే ఈ చిత్రాన్ని తెరకెక్కించామని తెలిపారు. చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ.. సినిమా విడుదలైన అతి తక్కువ కాలంలోనే లాభాల్లోకి ప్రవేశించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గత 50 ఏళ్లలో ఇలాంటి రికార్డులు చూడలేదని డిస్ట్రిబ్యూటర్లు చెబుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటించగా, బేబీ నక్షత్ర, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు.




# జయరాం, సిమ్రాన్‌ల పెళ్లి ఫొటో

## అసలు నిజం ఇది!

సీనియర్ నటులు జయరాం, సిమ్రాన్ రహస్యంగా వివాహం చేసుకున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తేలింది. వైరల్ అవుతున్న ఆ దృశ్యాలు కేవలం ఒక నూతన చిత్ర ప్రారంభోత్సవానికి సంబంధించినవని స్పష్టమైంది. వైరల్ అవుతున్న ఫొటోలలో జయరాం తెల్లటి పంచెలో, సిమ్రాన్ ఎరుపు రంగు పట్టుచీర ధరించి మెడలో పూలమాలలతో కనిపించారు. ఈ వేషధారణ చూసి చాలామంది నెటిజన్లు వారికి నిజంగానే వివాహం జరిగిందని భావించి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అయితే, వాస్తవాలను సరిచూసుకోకుండా ఇలాంటి వార్తలను ప్రచారం చేయడం సరికాదని, ఇది సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలను ఇబ్బందుల్లోకి నెడుతుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. వాస్తవానికి జయరాం, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఓ నూతన చిత్ర ప్రారంభోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమానికి హాజరైన నటీనటులను చిత్ర బృందం సంప్రదాయ బద్ధంగా పూలమాలలతో సత్కరించింది. ఆ సమయంలో తీసిన ఫొటోలనే కొందరు వక్రీకరించి, అవి వారి పెళ్లి ఫొటోలంటూ సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారు. విషయం తెలిసిన కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కొందరు కావాలనే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు.



## కాసర్ల శ్యామ్ ఆశీర్వాదాలు తీసుకుంటున్న అనిరుధ్.. ఫొటో వైరల్

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, జాతీయ అవార్డు గ్రహీత, సినీ గీత రచయిత కాసర్ల శ్యామ్‌కు అభివాదం చేయగా.. శ్యామ్ అతడికి ఆశీస్సులు అందిస్తున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రం కోసం వీరిద్దరూ కలిసి పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా స్టూడియోలో కాసర్ల శ్యామ్ ఆశీస్సులు తీసుకుంటూ అనిరుధ్ సందడి చేశారు. ఈ ఫొటోను చిత్ర నిర్మాణ సంస్థ ఎస్ఎల్‌వి సినిమాస్ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. "ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానం. కానీ ఇది వెయ్యి మాస్ బీట్స్‌తో సమానం. చుష్ట్రవ్ఞూఖుతీఖుఎఅంవ రెండో సింగిల్ త్వరలోనే విడుదల. 2026 సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్" అని క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మురికివాడల నేపథ్యంలో సాగే ఈ కథాంశంలో, వివక్షకు వ్యతిరేకంగా పోరాడే 'జడల్' అనే శక్తిమంతమైన పాత్రలో నాని అలరించనున్నారు. 'బలగం' చిత్రానికి జాతీయ పురస్కారం అందుకున్న కాసర్ల శ్యామ్, ఇప్పుడు అనిరుధ్ స్వరకల్పనలో సాహిత్యం అందిస్తుండటంతో ఈ పాటపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీతో పాటు ఇంగ్లీష్, స్పానిష్, బెంగాలీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అంతర్జాతీయంగా ఈ సినిమాను సమర్పించేందుకు హాలీవుడ్ స్టార్ ర్యాన్ రేనాల్డ్స్‌ను సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.